క్లుప్తంగా

ఘనంగా చండీ హోమం



చండీ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

వేంపల్లె: స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం భక్తిశ్రద్ధలతో చండీ హోమం(పూర్ణాహుతి) నిర్వహించారు. అలాగే రాత్రి అమ్మవారు భువనేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం రాత్రి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర, ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ కల్యాణ మండపం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ చైర్మన్ ప్రత్యేక పూజలు



కమలాపురం : పట్టణంలోని శ్రీ మత్కన్యకాపరమేశ్వరీదేవిని ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి దర్శించుకున్నారు. దేవీశరన్నవరాత్రి మహోత్సవాలకు సోమవారం రాత్రి ఆయన హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు శాలువా కప్పి, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు



చెక్క భజన చేస్తున్న గ్రామ ప్రజలు

లింగాల : మండలంలో దసరా ఉత్సవాలలో భాగంగా ఆదివారం లింగాల, బోనాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బతుకమ్మను ఏర్పాటు చేసి మహిళలు పెద్ద సంఖ్యలో చెక్కభజనలు, కోలాటలతో బతుకమ్మ పాటలు పాడుతూ భక్తిశ్రద్ధలతో వేడుకలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామాలు ప్రజలు పాల్గొన్నారు.

అన్నదానం

కడప కార్పొరేషన్: విజయదశమి సందర్భంగా చిన్నచౌకులోని హోండా షోరూం ఎదురుగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బీసీ నాయకుడు దాసరి సురేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బరాయుడు, కొండాయపల్లె మధుసూదన్‌రావు, చంగల్ రాజు పాల్గొన్నారు.

విశేష పూజలు

కడప కార్పొరేషన్: విజయ దశమిని పురస్కరించుకొని చెన్నూరులో వెలసిన చౌడేశ్వరి దేవి అమ్మవారిని టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాసీమను ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో 40వ డివిజన్ కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి, మధువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు దేవిరెడ్డి ఆదిత్య జన్మదిన వేడుకలు కడపలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాజారెడ్డి వీధిలో ఈ వేడుకలకు ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్ బాషా, మేయర్ సురేష్‌బాబులు ముఖ్య అతిథులుగా హాజరై ఆదిత్యతో కేక్ కట్ చేయించి కేకు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దేవిరెడ్డి ఆదిత్య యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని డిప్యూటీ సీఎం, మేయర్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వంశీనాథ్‌రెడ్డి, మియ్యా, కార్పొరేటర్లు కె.సూర్యనారాయణ రావు, షఫీ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో కడప నగర శివార్లలో సంస్థ శిక్షణాలయంలో బుధవారం నుంచి నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధి నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజులపాటు శిక్షణ కొనసాగుతుందని, శిక్షణాకాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. ఆసక్తిగల వారు 94409 05478 సంప్రదించాలని కోరారు.

కారుణ్య మాత వార్షికోత్సవం

కడప కల్చరల్ : స్థానిక పాలెంపల్లెలోని పునీత జోజప్ప గారి చర్చి ప్రాంగణంలోగల కారుణ్య మాత రెండవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మరియాపురం కెథడ్రల్ చర్చి డైరెక్టర్ ఫాదర్ బిరుసు రాజా ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక దివ్య బలిపూజ సమర్పించారు. అనంతరం పాలెంపల్లె మాజీ సర్పంచ్ మజ్జారి వెంకట సుబ్బ య్య, స్థానక వైఎస్సార్ సీపీ నాయకులు మజ్జారి వెంకట రమణలను ఫాదర్ బిరుసు రాజా, చర్చి ఉపదేశి జ్యోతి భాస్కర్ సన్మానించారు. కార్యక్రమంలో వివిధ విచారణలకు సంబంధించిన ప్రముఖులు జాన్ ప్రసాద్, మెల్ల ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

అంబరాన్నంటిన దసరా సంబరాలు

- ప్రత్యేక అలంకారాల్లో అమ్మవారు
- భక్తులతో కళకళలాడిన ఆలయాలు
- ముగిసిన ఉత్సవాలు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలో దసరా సంబరాలు అంబరాన్నంటాయి. భక్తిపారవశ్యంతో పట్టణం పులకించిపోయింది. ఏ ఆలయం చూసినా అశేష భక్తజనంతో దర్శనమిచ్చాయి. ఎంతో వైభవంగా కన్నుల పండుగలా దసరా సంబరాలు జరిగాయి. సోమవారం ఉదయం అమ్మవారిశాలలో వాసవీ కన్యకాపరమేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా మహర్నవమి, సర్వదేవతా హోమం, విజయదుర్గ హోమాలను వేదపండితులు జరిపించారు. అనంతరం అన్ని శుభాలకు,విజయానికి చిహ్నమైన శమీవృక్షాన్ని దర్శించుకునేందుకు అమ్మవారి ఉత్సవమూర్తితో ఊరేగింపుగా వెళ్లి తూర్పు ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఉన్న శమీవృక్షాన్ని దర్శించి పూజలు నిర్వహించారు. అక్కడ నుండి బ్యాండు వాయిద్యాల నడుమ ఆలయానికి చేరుకున్నారు. దసరా మహోత్సవం సందర్భంగా సోమవారం అమ్మవారు జగములనేలే జగజ్జననీగా దర్శనమిచ్చి తరింపజేశారు. అమ్మవారిని దర్శించుకొనేందుకు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. అమ్మవారిశాలలో, అంకాలమ్మ ఆలయాల్లో విజయలక్ష్మీదేవి అలంకారంలో కనువిందు చేశారు. అలాగే శ్రీవేంకటరమణుడి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి అలంకారంలో స్వామివారు భక్తులను తరింపజేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అమ్మవారి శాలతోపాటు అంకాలమ్మ, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాలతోపాటు షిర్డిసాయిబాబా, రంగనాథ స్వామి గ్రామోత్సవాలతో పులివెందుల భక్తిపారవశ్యంతో నిండుగా కనువిందుచేసింది. పురవీధులు భక్తులు కాయకర్పూరాలను సమర్పించి అమ్మలగన్న అమ్మను దర్శించి తరించారు. భూలోక వైకుంఠాన్ని తలపించేలా అమ్మవారు దర్శనమిచ్చారు. అమ్మవారిశాల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కొత్త రవి కుమార్ ఆధ్వర్యంలో విజయలక్ష్మీదేవి గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. రాత్రి అంతా ఎంతో ఉత్సాహంగా పురవీధుల గుండా బాణా సంచా పేలుస్తూ మంగళవారం ఉదయం 8గంటల వరకు గ్రామోత్సవం జరిగింది. అలాగే అంకాలమ్మ ఆలయ చైర్మన్ నాగేంద్రప్రసాద్, పాలకమండలి సభ్యుల ఆధ్వర్యంలో గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. చెక్కభజన ప్రత్యేకంగా ఆకట్టుకుంది. పోలీసుల పర్యవేక్షణలో గ్రామోత్సవం వైభవంగా జరిగింది. అమ్మవారు పార్నపల్లిరోడ్డు, ముత్యాల వారివీధి, గాడిచర్లవారివీధి, రీడింగ్‌రూంవీధుల మీదుగా గ్రామోత్సవం నిర్వహించారు. పట్టణంలో భక్తులు భక్తిపారవశ్యంతో మునిగితేలారు.



ముద్దనూరు: శ్రీగజలక్ష్మి అలంకారంలో అమ్మవారు

ముగిసిన మహోత్సవాలు

కమలాపురం: పట్టణంలో వెలసిన అమ్మవారిశాలలో ఈ నెల 15వ తేదీ నుంచి జరుగుతున్న శ్రీ మత్కన్యకాపరమేశ్వరీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిసాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు విజయదశమి(గ్రామోత్సవం) అలంకారంలో దర్శనమిచ్చి భక్తులను కనువిందు చేశారు. బచ్చు సత్యనారాయణ కుటుంబ సభ్యులు అమ్మవారి అలంకారానికి దాతలుగా వ్యవహరించగా భోజనపాటి వెంకట సుబ్బయ్య కుటుంబ సభ్యులు అమ్మవారికి పట్టుచీరె సమర్పించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఊరేగించారు. ఊరేగింపులో భక్తులు అమ్మవారిని దర్శించుకొని కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. మంగళవారం అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పాన్పుసేవ (వసంతోత్సవం) నిర్వహించారు. బోజనపాటి సునీల్ కుమార్ కుటుంబ సభ్యులు అమ్మవారి అలంకారానికి దాతలుగా వ్యవహరించగా గాజులపల్లె శంకర్ రావు కుటుంబ సభ్యులు అమ్మవారికి పట్టుచీరె సమర్పించారు. కాగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో అలంకరించి పట్టణంలోని పలు వీధులలో వసంతోత్సవం నిర్వహించారు. రంగు నీళ్లు చల్లుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ముద్దనూరు: శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ముగిసాయి. సోమవారం స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శ్రీ గజలక్ష్మి అలంకారములో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారు రాత్రి శమీదర్శనంనకు వెళ్ళారు. మంగళవారం రాత్రి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు.

వల్లూరు: వల్లూరులోని శ్రీవాసవీ ఆర్య వైశ్య కళ్యాణ భవనం నందు వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాత్రి అమ్మవారికి ఊయల సేవను నిర్వహించి ఉత్సవాలను ముగించారు. కాగా సోమవారం విజయ దశమిని పురష్కరించుకుని అమ్మవారు విజయలక్ష్మీ అలంకారంలో భక్తు లకు దర్శనమిచ్చారు. అనంతర మంగళవాయి ద్యాలు, బాణా సంచా పేలుల్లతో అమ్మవారి గ్రామోత్సవాన్ని, శమీ దర్శనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దుగ్గాయపల్లె, వెంకటాపురం వీవర్స్ కాలనీ గ్రామాల్లోని శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయాల్లో సోమవారం దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూల విరాట్‌లతో బాటు ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు.



వల్లూరు : అమ్మవారిశాలలో అమ్మవారి ఊయల సేవ

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల మండల పరిధిలో, పట్టణ పరిధిలలో జరిగిన దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. సోమవారం నాడు అమ్మవారు శ్రీ శారదదేవి, శ్రీ విజయలక్ష్మీదేవి అంలకరణలలో భక్తులకు దర్శనించారు. సోమవారం సాయంత్రం జరిగిన అమ్మవారి శమీ దర్శన ఉరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. శ్రీ ఏరువాక గంగమ్మతల్లి, శ్రీ చౌడేశ్వరీ దేవి, శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయాలలో అమ్మవారికి ప్రత్యేక అలంకరంచి శమీ దర్శనంకు ఉరిగేంపు గా తీసుకెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉరేగింపులో నిర్వహించిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గేటిపల్లి కొత్తపేట సరిహద్దుల్లో వెలసిన గంగమ్మ తల్లి ఆలయంలో దసరా సందర్భంగా మంగళవారం అమ్మవారు శ్రీ విజయలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పిబి విశ్వనాథరెడ్డి పి సురేష్ కుమార్ రెడ్డిలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



కమలాపురం: విజయలక్ష్మీ అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



పులివెందుల టౌన్ : విజయలక్ష్మీదేవి అలంకారం లో వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారు



చింతకొమ్మదిన్నె : శ్రీ విజయలక్ష్మి దేవి అలంకారంలో దర్శనమిస్తున్న గంగమ్మ తల్లి



ఎర్రగుంట్ల :శ్రీ ఏరువాక గంగమ్మ తల్లి ఆలయంలో శ్రీ శారదాదేవి అలంకరణలో అమ్మవారు



పులివెందుల టౌన్ : విజయలక్ష్మీదేవి అలంకారం లో వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారు

శిల్పారామంలో సందడి

పులివెందుల టౌన్ : స్థానిక శిల్పారామంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకొని నాలుగు రోజుల పాటు దసరా సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. యువరాజా డ్యాన్సింగ్ స్కూల్ మాస్టర్ యువకిషోర్ తమ శిష్యబృందంచే నిర్వహించిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్ పర్యవేక్షించారు. సందర్శకులచే శిల్పారామం నిండుగా కనువిందు చేసింది.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ల అందజేత

జమ్మలమడుగు : స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ఐదుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌లను ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదుగురికి కలిపి ముఖ్యమంత్రి సహాయనిధి కింద నాలుగు లక్షల రూపాయలు మంజూరైందని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ డబ్బులు ఖర్చు అయిన వారికి ఊరట కోసం సీఎం మంజూరు చేశారన్నారు. బాధితులు సద్వినియోగ పరచుకోవాలని సూచించారు.

ముద్దనూరు : ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఇద్దరికి మంగళవారం చెక్కులను పంపిణీ చేశారు. చింతకుంటకు చెందిన రామకృష్ణ, ముద్దనూరుకు చెందిన వెంకటరమణకు ఈ చెక్కులను మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డి అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన తమకు సహాయనిధి అందడంతో వారు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ శ్రీధర్ రెడ్డి, గుర్రప్పలు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జగనన్నకు చెబుదాం కార్యక్రమం వాయిదా

జమ్మలమడుగు : జమ్మలమడుగులో బుధవారం జరగాల్సిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం వాయిదా పడినట్లు ఎంపీడీఓ రాఘవేంద్ర పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఎప్పుడు జరిగేది ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో నిర్ణయించి చెబుదామని ఆయన పేర్కొన్నారు.

గాంధీజీ కలలు జగన్‌తో సాకారం

చింతకొమ్మదిన్నె : మహాత్మా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రసూల్‌పల్లి గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్బీకే కేంద్రం భవనాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఏపీ ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, సర్పంచ్ స్వాతి, నాయకులు నీలకంఠారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్న ఊరిలోనే సౌకర్యాలు

వీరపునాయునిపల్లె : ప్రజలకు ఉన్న ఊరిలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సౌకర్యాలు కల్పిస్తున్నారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని గంగిరెడ్డిపల్లెలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉప కేంద్రం, మినరల్ వాటర్ ప్లాంటు భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకొనే విధంగా ఉండేందుకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారు తిరుపాల్‌రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, స్థానిక నాయకులు కిషోర్‌రెడ్డి, శ్రీనివాసుల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, చైతన్యకుమార్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, ప్రతాప్ యాదవ్, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రసూల్‌పల్లెలో సచివాలయ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

బాధిత కుటుంబానికి పరామర్శ

కమలాపురం : బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. కమలాపురానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఓ.జాషువా పీటర్ ఈ నెల 11వ తేదీన గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం మృతుడి నివాసంలో జరిగిన సంతాప సభకు ఎమ్మెల్యే హాజరయ్యారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే జాషువా ఇద్దరు కుమార్తెలకు ఉద్యోగ అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

చింతకొమ్మదిన్నె: కడప నగర పరిధిలోని 17వ డివిజన్‌లో పారిశ్రామిక కార్మికులుగా పని చేస్తున్న సిబ్బందికి దసరా సందర్భంగా కార్పొరేటర్ చంద్రహాస్‌రెడ్డి సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి గుత్తిరెడ్డి లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్: పట్టణంలోని ఉల్లిమెల్ల చెరువుకు సంబంధించి కరెంట్ లైన్ మారుస్తున్న సందర్భంగా ఉదయం 10 నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. ప్రభుత్వాసుపత్రి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పగిలిన పైపులైన్

కడప కార్పొరేషన్: కడప నగరం రామాంజనేయపురం పరిధిలోని వరదకాలనీ సెంటర్‌లో పైపులైన్ దెబ్బతింది. ఫలితంగా తాగునీరు వృథాగా రోడ్డుపై పారుతోంది. సుమారు నెలరోజులవుతున్నా ఎవరూ ఈ లీకేజీని పట్టించుకోకపోవడంతో రోడ్డు అంతా బురదమయంగా మారింది. స్థానిక ప్రజలు ఈ బురదలో రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి లీకేజీని అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

మధురై ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

కడప కోటిరెడ్డి సర్కిల్ : మధురై–ఓఖా మధ్య నడుస్తున్న మధురై ఎక్స్‌ప్రెస్ (09519)ను దారి మళ్లించినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల ఈనెల 27వ తేదీ నుంచి ఈ రైలును దారి మళ్లించారన్నారు. ఈ రైలు రేణిగుంట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి మీదుగా నడవాల్సి ఉండగా.. కాట్పాడి, పాకాల, ధర్మవరం, గుత్తి మీదుగా ఓఖాకు నడుస్తుందన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు.

విలు విద్యా ప్రాచీనమైనది

వేంపల్లె : తరతరాలుగా ప్రజా జీవితంలో భాగమైన విలు విద్యా అతి ప్రాచీనమైనదని సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్ర ఓబులరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ క్రీడా మైదానంలో విలు విద్యా పోటీలు నిర్వహణను వారు సందర్శించారు. అనంతరం విలు విద్యను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదిమానవుడు ఆత్మరక్షణ, ఆహార సంపాదన కోసం విలువిద్యను ఉపయోగించే వారన్నారు. వేంపల్లెలో విలువిద్య పోటీలు నిర్వహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ షబ్బీర్‌వలి, ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు సంగమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలు విద్యా పోటీలో క్రీడాకారులు

పార్కులో సందర్శకుల సందడి

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలోని 45వ డివిజన్ పరిధిలోని చెమ్మమియ్యాపేటలోని భగత్‌సింగ్ పార్క్ మంగళవారం సందర్శకుల తాకిడితో కిట కిట లాడింది. దసరా పండుగ కావడంతో పాటు విద్యార్థులకు సెలవులు కావడంతో ప్రజలు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి పార్కులో బంధు మిత్రులతో సరదాగా గడిపారు. పార్క్‌లో ఏర్పాటు చేసిన ఆట వస్తువులతో చిన్నారులు ఆడుకుంటూ సందడి చేశారు.

శిల్పారామంలో ..

కడప కల్చరల్ : దసరా పండుగను పురస్కరించుకుని శిల్పారామంలో దసరా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం చిత్తూరు బైరెడ్డిపల్లెకు చెందిన కళాతరింగిణి బృందం సభ్యులు దసరా పండుగ విశిష్ఠతలను తెలిపే పలు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.



భక్తిశ్రద్ధలతో జ్యోతి ఉత్సవాలు

జమ్మలమడుగు : పట్టణంలోని నాగులకట్టలో వెలసిన చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలను తొగటవీర క్షత్రియులు వైభవంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి అమ్మవారు చౌడేశ్వరిదేవి అలంకారంలో దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులు బిందె సేవ ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం మంగళవారం తెల్లవాము నుంచి అమ్మవారి జ్యోతులను తయారు చేసి పురవీధుల మీదుగా చౌడేశ్వరి దేవి కీర్తనలు పాడుతూ.. జ్యోతులను నెత్తి మీద పెట్టుకుని నృత్యాలు చేసుకుంటూ వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.

కిక్కిరిసిన ఆలయాలు

దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం చివరి రోజు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. ముఖ్యంగా పట్టణంలో ప్రముఖ ఆలయాలైన అంబాభవానీ, కన్యకాపరమేశ్వరిదేవి, నాగులకట్టలోని చౌడేశ్వరిదేవి, సాయిబాబా ఆలయంలో ఉన్న శ్రీరాజరాజేశ్వరి దేవి, ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న లక్ష్మీప్రసన్న వెంకటేశ్వర ఆలయాలకు భక్తుల తాకిడి ఎక్కువగా కనిపించింది. ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, గిరిధర్‌రెడ్డి, శివారెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి, హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ విజయలక్ష్మీ, మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ దర్శించుకున్నారు.



జ్యోతులు ఎత్తుకొని వెళ్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి